నమస్తే తెలంగాణ
# హనుమకొండ
3 | వరంగల్, మంగళవారం 24 సెప్టెంబర్ 2024 | HANUMAKONDA


జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న అసమ్మతి వర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు

## కాంగ్రెస్‌లో ఫ్యాక్షన్ వార్

- జనగామలో తారస్థాయికి వర్గపోరు
- నన్ను చంపేందుకు కొమ్మూరి కుట్ర
- సుపారి గ్యాంగ్‌తో రూ.25 లక్షలకు డీల్
- వెస్ట్‌జోన్ డీసీపీకి కంచె రాములు ఫిర్యాదు
- ఫ్యాక్షన్ తరహా రాజకీయాలపై సీనియర్ల ఆందోళన
- రక్షణ కల్పించాలంటున్న సొంత పార్టీ నాయకులు

జనగామ, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : జనగామ కాంగ్రెస్‌లో వర్గపోరు తారస్థాయికి చేరింది. అంతర్గత కుమ్ములాటలతో ఫ్యాక్షన్ తరహా రాజకీయాలకు తెరలేపుతున్నది. 'హత్యా రాజకీయాల' నేపథ్యంలో సొంత పార్టీ నేతల నుంచే రక్షణ కావాలంటూ పోలీస్‌స్టేషన్ మెట్లెక్కడంపై సీనియర్లలో ఆందోళన వ్యక్తమవుతున్నది. తాజాగా డీసీసీ అధ్యక్షుడు, జనగామ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తనను హతమార్చేందుకు కుట్ర పన్నుతున్నాడని సొంత పార్టీకి చెందిన మాజీ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ వైస్ చైర్మన్ కంచె రాములు వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇసుక లారీతో ఢీకొట్టించి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు రూ.25 లక్షలకు సుపారి గ్యాంగ్‌తో డీల్ కుదుర్చుకున్నాడని అందుకు సంబంధించిన వీడియో ఆధారాలను సమర్పించారు. ఈ ఘటన జిల్లా కాంగ్రెస్‌లో పెను సంచలనాన్ని సృష్టించింది. కొమ్మూరి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న సీనియర్ నాయకులైన మాజీ మున్సిపల్ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణ రెడ్డి, మాజీ మార్కెట్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడల సిద్దయ్య, సర్వల నర్సింగరావు, మున్సిపల్ కౌన్సిలర్లు గంగరబోయిన మల్లేశం, ముత్యాల చందర్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, జాయ మల్లేశం, గాదెపాక మహేందర్, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, చింతకింది మల్లేశం, పులిగిల్ల శివ తదితర సొంత పార్టీ సీనియర్లు డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి నుంచి తమకు రక్షణ కల్పించాలంటూ డీసీపీ ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీలో తాను 30 ఏండ్లుగా వివిధ హోదాల్లో సేవలందించానని, గతంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశానని రాములు పేర్కొన్నారు. కొంతకాలంగా సీనియర్లకు దక్కాల్సిన పదవులను జిల్లా పార్టీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి అమ్ముకున్నాడని పార్టీ అధిష్టానికి ఫిర్యాదు చేశామన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కొమ్మూరి తమపై కక్షసాధింపులకు పాల్పడుతున్నాడని, భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని, అందులో భాగంగా కొద్దినెలల క్రితం మాజీ మున్సిపల్ చైర్మన్ వై సుధాకర్ కారును పెట్రోల్‌తో దగ్ధం చేశాడని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాజాగా తన అనుచరుడైన రావుల శ్రీనివాస్ రెడ్డిని కొమ్మూరి పిలిపించుకొని రూ. 25 లక్షల సుపారి ఇచ్చి తనను ఇసుక లారీతో ఢీకొట్టించి హతమార్చేందుకు కుట్రపన్నినట్లు తెలిపాడని, ఇదే విషయాన్ని సీనియర్ నాయకుల ముందు శ్రీనివాస్‌రెడ్డి చెప్పిన వీడియో రికార్డును కంచె రాములు డీసీపీకి అందజేశారు. ప్రశాంతతకు మారుపేరైన జనగామలో ఫ్యాక్షన్ రాజకీయాలతో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రయత్నిస్తున్న ప్రతాప్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనతో పాటు సీనియర్ నాయకులకు రక్షణ కల్పించాలని ఆ ఫిర్యాదులో కోరారు.


జనగామలోని సబ్‌జైలులో బీఆర్‌ఎస్ నాయకులతో ములాఖత్ అయిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## పాలకుర్తిలో నియంత పాలన

**సబ్ జైలులో బీఆర్‌ఎస్ నేతలను కలిసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి**

జనగామ, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : జనగామ సబ్ జైలులో విచారణ ఖైదీలుగా ఉన్న దేవరుప్పుల మండలానికి చెందిన ఇద్దరు బీఆర్‌ఎస్ నాయకులతో సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జైలు కలిశారు. పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకుల ఒత్తిడితో అక్కడి పోలీసులు దేవరుప్పుల మండలం చిన్నమడూరుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు వంగ అర్జున్, గొడుగు మల్లికార్జున్‌పై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసి సబ్ జైలుకు పంపారు. ములాఖత్ అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ 'జైలులో నా కార్యకర్తలు చాలా ధైర్యంగా ఉన్నారని, ప్రజా సమస్యలపై మీరు పోరాటం చేయాలి.. వెనక్కి తగ్గద్దు అంటూ పాలకుర్తి నియోజకవర్గంలో నియంత పాలన కొనసాగుతున్నదని నాకే ధైర్యం చెప్పారు' అని అన్నారు. ఎర్రబెల్లి వెంట దేవరుప్పుల మండల బీఆర్‌ఎస్ నాయకులు, జిల్లా నాయకులు ఉన్నారు.


డోర్నకల్‌లో ములక ఎడ్విన్‌రావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సత్యవతి రాథోడ్

## మానుకోటలో రూ. 1000 కోట్ల నష్టం

- వరద బాధితులు, రైతులను ఆదుకోని ప్రభుత్వం
- అన్నదాతలను మోసం చేస్తున్న కాంగ్రెస్
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

డోర్నకల్, సెప్టెంబర్ 23 : ఇటీవల వచ్చిన వరదలకు మహబూబాబాద్ జిల్లాలో రూ. 1,000 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. వరద బాధితులు, రైతులకు రూ. 10 వేల చొప్పున ఇస్తామన్న పరిహారాన్ని ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేదని ఆరోపించారు. సోమవారం డోర్నకల్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకుడు మాన్యు పాట్ని నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేయలేదని, షరతులతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. తమ ప్రభుత్వంలో 36 లక్షల మంది రైతులకు కేసీఆర్ రూ. లక్ష వరకు విడతల వారీగా రుణమాఫీ చేశారని తెలిపారు. అన్నదాతలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదని, రైతులు, కౌలు రైతులకు ఇస్తానన్న రైతు భరోసా సెప్టెంబర్ మాసం గడుస్తున్నప్పటికీ అందించలేదని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి ఒకటి చెపితే, సీఎం మరొకటి చెపుతున్నాడని అన్నారు. ముదిరాజ్‌లకు కూడా ఇంతవరకు చేపపిల్లలు అందించలేదని, గ్రామాల్లో వరదలకు తెగిపోయిన చెరువులు, కుంటలకు మరమ్మతులు చేసే దిక్కులేదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సరైన అవగాహన లేదని, ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా సరిగా అమలు చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజలు, మేధావులు, విద్యావంతులు, ఆలోచన చేయాలని సత్యవతి రాథోడ్ సూచించారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ**

డోర్నకల్ సీఎస్ఐ చర్చి మాజీ కోశాధికారి ములక ఎడ్విన్‌రావు (94) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న సత్యవతి రాథోడ్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు ఎడ్విన్‌రావు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట మాజీ జడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు, వార్డు కౌన్సిలర్లు బోరగల్ల శరత్‌బాబు, కొండేటి హేమచంద్ర శేఖర్, వీరన్న, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మారబోయిన రాంభద్రం, బీఆర్‌ఎస్ నాయకులు మాన్యు పాట్ని, కొత్త వీరన్న, సూర మధు, కందుల మధు, గౌస్, రేపాకుల కృష్ణ తదితరులున్నారు.

## ధ్వంసమైన విగ్రహాల నివేదిక ఇవ్వండి

**ములుగు కలెక్టర్ దివాకర**

వెంకటాపూర్, సెప్టెంబర్ 23 : రామప్ప ఉపాలయమైన గొల్లగుడిని, తూర్పు రోడ్డును ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర సోమవారం పరిశీలించారు. గుడి పైకప్పు, దెబ్బతిన్న శిఖరం, పైకప్పులోని తామరపువ్వు గుర్తుతో ఉన్న ధ్వంసమైన శిల్పాన్ని పరిశీలించగా ఆలయ వివరాలను పురావస్తు శాఖ సీఏ మల్లేశం వివరించారు. ధ్వంసమైన శిల్పం వివరాలతో నివేదిక ఇవ్వాలని కేంద్ర పురావస్తు శాఖ అధికారిని ఆదేశించారు. అలాగే తూర్పు రోడ్డు అభివృద్ధి పనుల్లో వేగం పెంచి, ఏరియా మ్యాపింగ్ సర్వే చేసి, బౌండ్రీ ఫిల్లర్ వేసి హద్దులు ఏర్పాటుచేయాలని అధికారులకు చెప్పారు. ఇరిగేషన్ డీఈ రవిందర్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో రాజు, ఆర్ఐ రమేశ్, కార్యదర్శి రేవతి పాల్గొన్నారు.


గొల్లగుడిని పరిశీలిస్తున్న ములుగు కలెక్టర్ దివాకర

**నిందితులను త్వరలోనే పట్టుకుంటాం : ఎస్సై సతీశ్**

గొల్లగుడిని ధ్వంసం చేసిన నిందితులను త్వరలో పట్టుకుంటామని ఎస్సై జక్కలు సతీశ్ తెలిపారు. సోమవారం ఆలయాన్ని, సీసీటీవీ ఫుటేజీని పరిశీలించామని, అనుమానితులను గుర్తించి విచారణ చేపడుతామన్నారు.

# రామప్పకు రక్షణేదీ?

**ఉపాలయాలపై కరువైన పర్యవేక్షణ**

- ఆకతాయిల చేతుల్లో ధ్వంసమవుతున్న అపురూప శిల్ప సంపద
- గతంలోనూ గుప్తనిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్య
- యునెస్కో గుర్తింపు పొందినా కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖల నిఘా శూన్యం
- సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటుచేయాలంటున్న గ్రామస్తులు


రామప్ప దేవాలయం

**అపురూప శిల్ప సంపదతో అందరి దృష్టిని ఆకర్షించి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయం.. దాని 18 ఉపాలయాలకు రక్షణ కరువైంది. యునెస్కోలో ఈ ఆలయానికి చోటు దక్కినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణ, నిఘా కొరవడి దుండగుల చేతిలో ధ్వంసమై చారిత్రక ఆనవాళ్లు కోల్పోతున్నది. గతంలో ప్రధాన ఆలయ గర్భ గుడి తాళాలు పగులగొట్టి హుండీలను దొంగలు ఎత్తుకెళ్లగా, గుప్తనిధుల కోసం ఉపాలయాల్లోని శివలింగాలను, దేవతామూర్తులను పెకిలించడంతో పాటు బంగారం, వజ్రాలు ఉంటాయనే మూఢనమ్మకంతో చెరువు కట్టపై ఉన్న ఆలయంలోని నంది విగ్రహం మెడను ధ్వంసం చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. తాజాగా ఆదివారం దుండుగుల దుశ్చర్యకు గొల్లగుడి పైకప్పను ధ్వంసమైన ఘటనతో ఆలయ పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. మూఢనమ్మకాల ముసుగులో ఆకతాయిలు చారిత్రక సంపదను నామరూపాల్లేకుండా చేస్తున్న తరుణంలో కేంద్ర పురావస్తు శాఖ అదనపు సిబ్బందిని, సెక్యూరిటీతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి ఆలయాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు, చరిత్రకారులు కోరుతున్నారు.**

**- వెంకటాపూర్, సెప్టెంబర్ 23**

### అదనపు సిబ్బందిని నియమించాలి



రామప్ప ఆలయంతో పాటు ఉపాలయాలకు సిబ్బందిని పెంచి ఆలయాలను రక్షించుకోవాలి. గతంలో రామప్పలో హుండీ దొంగతనం, చెరువు దగ్గర గుడిలోని నంది విగ్రహాలను ధ్వంసం చేయగా నాటి కలెక్టర్ స్పందించి హోంగార్డులను నియమించారు. వారు ప్రస్తుతం లేకపోవడంతో పురావస్తు శాఖ సిబ్బంది క్లీనింగ్‌తో పాటు సెక్యూరిటీ విధులు నిర్వర్తిస్తున్నారు. రామప్పలో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి ఉపాలయానికి నలుగురు సిబ్బందిని ఏర్పాటు చేయాలి. యునెస్కో గుర్తింపు లభించిన కూడా ఆలయాలను రక్షణ లేకపోవడం శోచనీయం. – ఆకిరెడ్డి వెంకట రామ్మోహన్‌రావు, రామప్ప పరిరక్షణ సమితి కన్వీనర్


ఆలయంలో దుండగులుధ్వంసం చేసిన పై కప్పు


గుప్తనిధుల కోసం ఆలయాల్లో ధ్వంసం చేసిన ఆనవాళ్లు


రామప్ప ఆలయం సమీపంలోని గొల్లగుడి


గతంలో చెరువు కట్టపై ధ్వంసం చేసిన గుడిలోని నంది


ధ్వంసమైన పై కప్పు డిజైన్

రామప్ప దేవాలయంతో పాటు చుట్టుపక్క న సుమా రు 18 ఉపాలయాలు ఉన్నాయి. వీటిలో ప్రధాన ఆలయంతో పాటు ఫెన్సింగ్ ఏర్పాటుచేసిన లోపల ఆలయాలను కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఉన్నాయి. యునెస్కో గుర్తింపు వచ్చిన తర్వాత గొల్లగుడి, శివాలయం కేంద్ర పురావస్తు శాఖ స్వాధీనం చేసుకొంది. మిగతా 8 ఆలయాలు రాష్ట్ర పురావస్తు శాఖ ఆధీనంలో ఉండగా వాటిని రక్షించడం లో అధికారులు, ప్రభుత్వాలు ఆలసత్వం ప్రదర్శిస్తున్నాయి. 2007 సంవత్సరంలో రామ ప్ప ప్రధాన ఆలయం గర్భ గుడి తాళాలు పగులగొట్టి హుండీలను ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత రామ ప్ప ఆలయానికి పోలీస్ శాఖ నుంచి 10 ఏళ్ల పాటు 4 హోంగార్డులను కేంద్ర పురావస్తు శాఖకు కేటాయించి పగలు ఇద్దరు, రాత్రి ఇద్దరు కాపాలా కాసేవారు. ఆ తర్వాత హోంగార్డులను తొలగించారు. హోంగార్డులను తొలగించిన తర్వాత కొన్ని రోజులు ప్రైవేట్ సెక్యూరిటీని పురావస్తు శాఖ నుంచి ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం సెక్యూరిటీ సిబ్బంది కూడా రామప్పలో లేరు. గతంలోను ఉపాలయాల్లోని శివలింగాలను, దేవతామూర్తులను పెకిలించి, పునాదుల్లో నిధులు ఉంటాయని ధ్వంసం చేసిన సంఘటనలు అనేకం. రామప్ప చెరువు కట్టపై ఉన్న ఆలయం(కల్యాణ మండపం)లో 2010లో నంది విగ్రహం మెడను దుండగులు ధ్వంసం చేశారు. నందికి ఆమడదూరంలో నిధి ఉందనే ప్రచారం, వజ్రాలు, బం గారం ఉంటుందని నంది మెడను పగులగొట్టారు. హరితహోటల్ పక్కన ఆలయాలతో పాటు గొల్లగుడి, శివాలయం, భైరవగుడి, వరహాల గుట్ట, ఆలయం చుట్టూ ఉన్న కోట కట్ట, నర్సరీ ఏరియాల్లో కొన్నేళ్ల క్రితం తవ్వకాలు చేపట్టి అరుదైన శిల్పాలను, దేవతామూర్తుల విగ్రహాలను ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తాజాగా గొల్లగుడి పైకప్పులోని పువ్వు ఆకారం మధ్యభాగంలో వజ్రాలు ఉంటాయనే మూఢనమ్మకంతో దుండగులు కప్పు భాగాన్ని తొలగించి దానిని కింద పడేసి దానిని ఒకరాయిపై పెట్టి పువ్వు ఆకారం(కలశం లాంటి) మధ్య భాగాన్ని పూర్తిగా సుత్తితో పగులగొట్టిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. రామప్ప గుడి ముందున్న గొల్లగుడి.. నివాసాలకు 100 మీటర్ల లోపే ఉంటుంది. ఇందులోనే దుండగులు ఇలా ధ్వంసం చేస్తే చెరువు కట్టపైన ఉన్న ఆలయాల పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రామప్ప ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలను పర్యాటకులు చూసేలా వినియోగంలోకి తీసుకురావడంతో పాటు రాత్రీపగలు కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖలు సిబ్బందిని, సెక్యూరిటీని నియమించాలని, సీసీ కెమెరాలు, లైటింగ్ ఏర్పాటు చేసి దుండగుల నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### అరుదైన కళను భావితరాలకు అందించాలి



రామప్ప ఆలయంతో పాటు ఉపాలయాలను ప్రభుత్వాలు, అధికారులు రక్షించి భావితరాలకు అందించాలి. దుండగులు ఆలయాలను ధ్వంసం చేయడంతో పాటు ఆకతాయిలు అత్యుత్తమైన కట్టడాలపైన పేర్లు చెక్కడం, ఇటుకలు రాళ్లను తొలగించడం చేస్తున్నారు. సీసీ కెమెరాలు, పోలీస్ సెక్యూరిటీని పెంచి కళకండాలను కాపాడాలి. – బుషిగుంపుల రాజయ్య


గుప్తనిధుల కోసం ఆలయాల్లో ధ్వంసం చేసి శివలింగాన్ని తొలగించిన ఆనవాళ్లు

### గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరు

రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు లభించిన అనంతరం రామప్ప ప్రధాన ఆలయానికి, ప్రసాద్ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, నాటి కేసీఆర్ సర్కారు రాష్ట్ర పురావస్తు శాఖ పరిధిలోని 5 ఉపాలయాల పునర్నిర్మాణానికి రూ.15కోట్లు మంజూరు చేసింది. రామప్ప చెరువు కట్టపై ఉన్న త్రికూటాలయంతో పాటు మరో రెండు ఆలయాలు మరింత దెబ్బతినకుండా రూ. 50 లక్షలతో చెరువు వైపు ప్రొటెక్షన్ వాల్ నిర్మించి ఆలయం చుట్టూ మొరం పోసి చదును చేశారు.

## శాయంపేట పీఏసీఎస్‌లో రూ.3కోట్ల స్కాం?

- రుణమాఫీలో అవినీతి జరిగిందని రైతుల ఆరోపణ
- జిల్లా సహకార శాఖ అధికారికి ఫిర్యాదు

శాయంపేట, సెప్టెంబర్ 23 : శాయంపేటలో ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో అక్రమాలు జరిగినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. సంఘం సీఈవో గుర్రం రాజమోహన్‌పై జిల్లా సహకార శాఖ అధికారికి ఫిర్యాదు చేసినట్లు మాజీ సర్పంచ్ కందగట్ల రవి సోమవారం తెలిపారు. పీఏసీఎస్‌లో తాను రూ.2.30లక్షలు రుణం తీసుకున్నట్లు చూపించారని, దీంతో రుణమాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌బీఐలో రూ.1.05 లక్షలు ఉండగా చెల్లించినట్లు చెప్పారు. పీఏసీఎస్‌లో రూ.70వేల రుణం తీసుకున్నానని, రుణం చెల్లిస్తానంటే సీఈవో వద్దని చెప్పారని తెలిపాడు. నెలరోజులుగా తిప్పుంచుకుంటున్నాడని, దీంతో బ్యాంకు డాటా తీసుకోగా, లోన్ రెన్యూవల్ చేసి తనకు తెలవకుండానే డబ్బులు తీసుకున్నట్లు చెప్పాడు. నిలదీస్తే రూ.70వేలకు రూ.1.17లక్షలు చూపించారన్నారు. అంత వడ్డీ ఎలా అవుతుందని డాటా తీసి ప్రశ్నిస్తే తప్పు పడినట్లు సీఈవో చెప్పారన్నారు. అయితే చివరికి మిత్తితో రూ.83వేలే ఉందని తప్పు జరిగిందని సీఈవో చెప్పినట్లు రవి తెలిపాడు. ఎస్‌బీఐతో పాటు పీఏసీఎస్‌లో రుణం మొత్తం కలిపితే తనకు రూ.2లక్షల్లోపే ఉందని, రుణమాఫీ వర్తించేదని చెప్పాడు. దీంతో తనకు తీవ్ర అన్యాయం జరిగిందని డీసీవోకు ఫిర్యాదు చేశానన్నాడు. అయితే ఇలా చాలా మందికి రుణమాఫీ విషయంలో అక్రమాలు జరిగినట్లు చెబుతున్నాడు. సుమారు రూ.3కోట్ల వరకు స్కాం జరిగినట్లు ఆరోపిస్తున్నాడు. అలాగే ఆత్మకూరు డీసీసీబీలో ఓ వ్యక్తి రుణం తీసుకున్నాడని, అయితే శాయంపేట పీఏసీఎస్‌లోనూ అతడు రుణం తీసుకున్నట్లు రికార్డులు సృష్టించినట్లు చెబుతున్నారు. రెండు అకౌంట్ల వల్ల రుణమాఫీ వర్తించకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిసింది. తప్పు జరిగిందని తొలగిస్తానని సీఈవో చెప్పినట్లు సమాచారం. ఈ విషయంపై పీఏసీఎస్ సీఈవో రాజమోహన్‌ను వివరణ కోరగా, సంఘంలో ఎలాంటి అవినీతి జరగలేదని చెప్పారు. ఇది ఇన్‌బ్యాలెన్స్ ఉన్న సొసైటీ అని చెప్పారు. 1,100 మంది రైతులు 2017 నుంచి 2021 వరకు వడ్డీ కట్టలేదన్నారు. రైతుల పేరుపై రూ.2.97 కోట్లు జమయ్యాయన్నారు. అధికారులకు అన్ని రికార్డులు అందజేస్తానన్నారు. కాగా, గతంలో శాయంపేట పీఏసీఎస్‌లో అక్రమాలు చోటు చేసుకున్నాయని, అధికారులు పలుమార్లు విచారణ జరిపినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు చెబుతున్నారు.

## ములుగు చేరేదెప్పుడో..?

- హనుమకొండలో 'ములుగు' ప్రయాణికుల తిప్పలు
- సరిపడా బస్సుల్లేక గంటల తరబడి పడిగాపులు
- తిరుగు ప్రయాణం కోసం తప్పని ఇబ్బందులు


హనుమకొండ బస్‌స్టేషన్‌లో ములుగు, ఏటూరునాగారం బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ములుగు, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లాకేంద్రం సహా ఏటూరునాగారం, మంగపేట ప్రాంతాల నుంచి పనులు, విధుల కోసం హనుమకొండకు వెళ్లడం సరే గానీ తిరిగి ఇంటికి చేరడం సగటు ప్రయాణికుడికి గగనమవుతోంది. సరిపడా బస్సుల్లేక హనుమకొండ బస్‌స్టేషన్‌లో గంటల తరబడి పడిగాపులు కాస్తూ తిరుగు ప్రయాణం కోసం తిప్పలు పడాల్సి వస్తోంది. సోమవారం సాయంత్రం సుమారు 400మంది ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూడడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు 'నమస్తే తెలంగాణ'కు ఫోన్‌లో తమ ఆవేదనను పంచుకోవడంతో పాటు తిరుగు ప్రయాణం కోసం వారు తిప్పలు ఫొటోలను పంపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని ప్రాంతాలకు ఐదు నిమిషాలకు ఒక బస్సు వెళ్తుందని, ములుగు ప్రాంతానికి మాత్రం సాయంత్రం అయిందంటే ప్రతీ రోజు గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొందని చెప్పుకొచ్చారు. ఒక బస్సు వస్తే సీటు కోసం తొక్కిసలాటలు జరిగే దుస్థితి నెలకొందని ఆరోపించారు. అంతేగాక ములుగు ప్రయాణికులను చిన్నచూపు చూసేలా బస్టాండ్ చివరికి రేకుల షెడ్ వేశారని చిన్నబుచ్చుకున్నారు. అంతేగాక ఆ ప్రాంతంలో అందరూ మూత్రవిసర్జన చేయడం వల్ల దుర్వాసనతో కనీసం నిల్చోలేకపోతున్నామని ఆవేదనతో చెప్పారు. అటు బస్సులు రాక.. ఆర్టీసీ అధికారులు పట్టించుకోక నరకం అనుభవిస్తున్నామని వాపోయారు. ఇప్పటికైనా సాయంత్రం వేళ హనుమకొండ నుంచి ములుగు ప్రాంతానికి సరిపడా బస్సులు ఏర్పాటుచేయడంతో పాటు ములుగ పాయింట్‌ను సుందరీకరించాలని డిమాండ్ చేశారు.

## పాల బిల్లులు రాక.. పశుపోషణ లేక..

- ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు
- విజయ డెయిరీ పరిధిలో రూ. 60 లక్షలు పెండింగ్

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 23 : ప్రభుత్వ రంగ విజయ డెయిరీని నమ్ముకొని పాలు పోసిన పాడి రైతులకు సకాలంలో బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రతి 15 రోజులకు ఒకసారి వచ్చిన బిల్లులు ప్రస్తుతం రెండు నెలలకు ఒకసారి కూడా రావడం లేదు. దీంతో పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టి పాడి పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న రైతులు ప్రస్తుతం పశువులకు దాణా కూడా అందించలేకపోతున్నారు. జనగామ మినహా హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోని 2 వేల మంది వరకు పాడి రైతులు విజయ డెయిరీపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరు సగటున రోజుకు 9 వేల లీటర్ల పాలు పోస్తున్నారు. వీరికి జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి సుమారు రూ. 60 లక్షల వరకు బిల్లులు బకాయి ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. సకాలంలో పాల బిల్లులు అందకపోవడంతో దాణా, మేత ఖర్చులు, ఆవులు, గేదెల కొనుగోలుకు చేసిన అప్పులు, లోన్లు తీర్చేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు పశువులకు రాయితీ దాణాతో పాటు రూ. 4 ప్రోత్సాహకం కూడా అందడం లేదు. అయినప్పటికీ పెండింగ్ బిల్లులు వస్తాయనే ఆశతో అప్పులు తెచ్చి మరీ పశువులను పోషిస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. పాల ఉత్పత్తి, నాణ్యత విషయంలో విజయ డెయిరీకి మంచి పేరున్నప్పటికీ ప్రైవేట్ డెయిరీలు మార్కెట్‌లో లీటర్ పాలను రూ. 10 తక్కువకు విక్రయిస్తుండడం ప్రభావాన్ని చూపుతున్నది.

### విజయ డెయిరీని మూసివేసే ప్రయత్నం



విజయ డెయిరీ పాల బిల్లులు చెల్లించకపోవడానికి పర్యవేక్షణ లేకపోవడమే కారణం. వినియోగదారులకు నమ్మకం లేకపోవడంతో మార్కెట్‌లో సేల్స్ పడిపోయాయి. రైతుల నుంచి తీసుకున్న పాలు, పాల పదార్థాలు అమ్మకపోవడం వల్ల నష్టం జరిగింది. హైదరాబాద్ పెద్ద మార్కెట్ అయినా విజయ డెయిరీ పాత్ర నామమాత్రంగానే ఉంది. ఇప్పటి వరకు సంస్థ రైతులకు రూ. 2 కోట్ల వరకు బాకీ పడింది. ప్రభుత్వం వెంటనే స్పందించి పాల బిల్లులు చెల్లించాలి. రాష్ట్రంలో చంద్రబాబుకు చెందిన హెరిటేజ్ కంపెనీ వ్యక్తిగత లాభాల కోసం తప్ప రైతుల కోసం కాదు. చంద్రబాబు ఉమ్మడి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చిత్తూరులోని విజయ డెయిరీని భ్రష్టు పట్టించి హెరిటేజ్ నిర్మించుకున్నాడు. ఇప్పుడు తెలంగాణలో చంద్రబాబు శిష్యుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి అతడికి సహకరిస్తున్నాడు. విజయ డెయిరీని నష్టాల్లోకి నెట్టి మూసివేసే ప్రయత్నం చేస్తున్నాడు. తెలంగాణలో ఉన్న పాడి రైతులు ఏకమై ప్రభుత్వాన్ని నిలదీసి డెయిరీని నిలబెట్టుకోవాలి. – ఇరుకు దేవేందర్‌రావు, విజయ కాకతీయ పాడి రైతుల సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు